విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక




సంపుటి: 16 | సంచిక : 92 | బుధవారం 29. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00



## లోక్‌సభలో పేపర్ లీకేజీ సవరణ బిల్లు

- పార్లమెంట్‌లో కొనసాగిన ప్రతిష్ఠంభన
- మోడీ, అమిత్‌షా క్షమాపణలకు విపక్షాల డిమాండ్



## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

- రాహుల్ గాంధీ డిమాండ్

# ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తాం

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- బతుకమ్మకుంటలో బీఆర్‌ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశారు
- కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించారన్నారు.
- పదెకరాలు కబ్జా చేస్తే కనకవర్షం కూడా కురిపించవచ్చు
- "హైడ్రా.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అతిపెద్ద సంస్కరణ
- హైడ్రా పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం.
- చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి.
- బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు.
- ఎన్ కన్వెన్షన్‌ను కూల్చారు.. అది పేదలదా?
- కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులున్నాయి.
- తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం"





## కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ

హైదరాబాద్ తెలంగాణ వాణి)
అంతకుముందు కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. పీఎంఏవై 2.0 పథకం కింద రాష్ట్రానికి 11.56లక్షల ఇళ్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణలో గ్రామీణ ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో నేపథ్యంలో వీబీ-జీ-రామ్‌జీలో అదనపు పనులు చేర్చాలని సీఎం విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధి మెరుగుకు 10 కొత్త పనులను ఆ పథకం కింద చేర్చాలని కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్లకు అనుమతి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పనులను వీబీ-జీ-రామ్‌జీ జాబితాలో చేర్చి లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. రేవంత్ వెంట రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు ఉన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోంది. బీఆర్ఎస్ హయాంలో బకాయిలు పెట్టిన రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్లు భారంగా మారింది. వాటిని మేం ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశంపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచం దర్‌రావు, ఆ పార్టీ ఎంపీ ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారు.

# 'హైడ్రా' పక్కా ఓ బ్లాక్‌మెయిల్ టూల్..

## బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- 'హైడ్రా'పై హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు
- 'హైడ్రా' చీఫ్‌గా రంగనాథ్‌ను తక్షణమే తప్పించాలి
- ధర్మాసనం చెప్పినట్లుగా హైడ్రా తొమ్మిది తలల విషనాగు అంటూ సెటైర్లు
- సీఎం ఆ సంస్థను పక్కా ఓ బ్లాక్‌మెయిల్ టూల్‌గా వాడుతున్నారు
- రేవంత్ రెడ్డి స్కీమ్ వెనుక పెద్ద స్కామ్ ఉందని, హైడ్రాను అడ్డుపెట్టుకుని దందాలు
- వచ్చిన డబ్బులను రాహుల్ గాంధీకి, బీజేపీ అధిష్టానానికి సంచుల్లో నింపి పంపుతున్నారు
- రాష్ట్రంలోని బీజేపీ నేతలు కూడా స్వచ్ఛందంగా సహకరిస్తున్నారు
- ఆ సంస్థను అడ్డుపెట్టుకుని బిల్డర్ల దగ్గర ఆర్‌ఆర్ టాక్స్ వసూలు చేస్తున్న మాట వాస్తవం కాదా..
- ఇక, 'నీట్' పేపర్ లీక్ ఇష్యూలో మోడీ ప్రభుత్వంపై తొలిసారి యువత తిరగబడింది
- ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్ల, వాళ్లు ప్రజలకు మద్దతుగా నిలబడలేక యువత నేరుగా ఉద్యమం చేస్తున్నారు
- అవసరం ఉన్నప్పుడు యువత రియాక్ట్ అవుతుందని గతంలో కేసీఆర్ చెప్పిన మాట నిజమైంది
- ఆన్‌లైన్ ఉద్యమం ఉగ్రరూపం దాల్చి ఏకంగా పార్లమెంట్‌ను చుట్టుముట్టింది
- కంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో 3 సార్లు 'నీట్' పేపర్ లీక్ అయింది



# రాహుల్ గాంధీ ధర్నాతో సీజేపీ ఉద్యమం పీక్స్‌కు

## ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

- ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతల్లో 90 శాతం జెన్ జీలే ఉన్నారు
- విద్యార్థుల నిరసన కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు
- నీట్ అనేది కోట్లాది విద్యార్థులు సమస్య అని, మధ్య తరగతి కుటుంబాలు సైతం ఈ నిరసనలో పాల్గొన్నారు
- కాక్రోచ్ పార్టీ ఆన్?లైన్ ఉద్యమం మొదలు పెట్టిందని ఆ పార్టీ నినాదాన్ని బలంగా తీసుకెళ్లింది రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ ప్రధాని ఇంటి ముందు ధర్నా చేయడంతో ఉద్యమం పీక్స్ కి వెళ్లింది
- మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్?కు సన్మానం చేయడం బీజేపీ మనస్తత్వాన్ని తెలియచేసిదంది
- తుమ్మిడి హట్టిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరుగుతున్నాయి
- రాష్ట్ర ప్రయోజనాల కోసం చర్చలు చేసి ముందుకు వెళ్తాం
- మేం పని చేసుకుంటూ వెళ్తాం ప్రమోషన్ గురించి మేం పట్టించుకోబోం
- ప్రమోషన్స్, పీఆర్ స్టంట్ చేసుకుంటూ వెళ్లిన బీఆర్ఎస్ పని ఏమైందో చూశాం
- బెంగుళూరు కంటే ఎక్కువ గ్లోబల్ కెపాబులిటీ సెంటర్స్ హైదరాబాద్ వస్తున్నాయి
- హైడ్రాకు మద్దతుగా ప్రజలు ర్యాలీ తీస్తున్నారన్నారు.
- హైడ్రా విషయంలో కోర్టు తీర్పును గౌరవిస్తామని, మేం చెప్పాల్సింది కోర్టుకు చెప్తాం





## కేంద్రం హామీలు బుట్టదాఖలు

- కేసుల ఉపసంహరణపై కదలిక లేదు
- దేశవ్యాప్త ఆందోళనలకు సీజేపీ హెచ్చరిక
- విద్యార్థులకు న్యాయసాయం కోసం 'సాక్షి' ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

# బంగాఖాతంలో అల్పపీడనం

## తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# చార్‌ధామ్ యాత్ర నిలిపివేత



ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో చార్‌ధామ్ యాత్ర మార్గాలు పలు చోట్ల దెబ్బతిన్నాయి. యాత్రికుల భద్రత దృష్ట్యా మంగళ, బుధవారాల్లో యాత్రను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, రహదారులను పునరుద్ధరించిన తర్వాత యాత్రను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు. అప్పటి వరకు యాత్రకు బయలుదేరే భక్తులు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు.

## కృష్ణా జలాల్లో వాటాకు ఏపీ డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఏపీ
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం





# పారిశ్రామికాభివృద్ధి మరింత వేగం

## ఈ-సిటీ, మంఖాల్, మహేశ్వరం పారిశ్రామిక పార్కుల్లో సీఎస్ సంజయ్ జాజు విస్తృత పర్యటన

పెట్టుబడులు, తయారీ సామర్థ్యం, ఉపాధి కల్పనపై సమీక్ష

# డ్రగ్స్ మత్తులో

## పోలీసులపై దూసుకెళ్లిన కారు

- హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు..
- ఇన్‌స్పెక్టర్ సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- హత్యాయత్నం కేసులు నమోదు..
- నిందితుడు సైఫ్ అరెస్ట్





## మావల రైతు వేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమం



**ఆదిలాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మావల రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు సీడ్ మేళా నిర్వహించి, కేడీడీపీ పీఆర్-4-176 విత్తనాలు, కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## బీజేపీ లోకి చేరికలు




**పటాన్ చెరు, జులై 28, (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు మండలం లోని క్యాసారం గ్రామంలో మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో భారతీయ జనతా పార్టీ లో చేరారు. మంగళ వారం నాడు సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి కొత్తగా చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె క్యాసారం గ్రామంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను కూడా గోదావరి అంజిరెడ్డి ఆవిష్కరించి పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, రవీందర్ క్యాసారం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, సుధాకర్, నర్సింహా గౌడ్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ విద్యుత్ బిల్లును ప్రభుత్వమే చెల్లించాలని వినతి



**నాగిరెడ్డిపేట మండలం జూలై 28:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని ఎంపిటిఓ కార్యాలయంలో ఎంపీడీవో గంగాధర్ కు గ్రామాల సర్పంచులు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు . మండలంలోని సర్పంచుల ఫోరం అధ్యక్షులు మురళీమోహన్ గౌడ్ మాట్లాడుతూ.... గ్రామపంచాయతీ లోని విద్యుత్ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని మంగళవారం రోజున ఎంపీడీవో గంగాధర్ కు వినతి పత్రం అందజేశామని తెలిపారు . అన్ని గ్రామాల పంచాయతీలు విద్యుత్ చార్జీలు మూడు సంవత్సరాల నుండి చెల్లించకుండా అలాగే పెండింగ్లో ఉన్నాయని తెలిపారు . ఈ విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని సర్పంచుల ఫోరం నుండి డిమాండ్ వ్యక్తం చేశారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల సర్పంచ్లు పాల్గొన్నారు .

## రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలి

**అంతర్గాం మండల్ వ్యవసాయ అధికారి సతీష్,**



**పెద్దపల్లి, జూలై,28( తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో, రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు. భూగర్భ జల శాఖ సమాచారం ప్రకారం పెద్దపల్లి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం సుమారు 1.5 మీటర్లు దిగువకు వెళ్లినట్లు తెలిపారు. నీటిపారుదల శాఖ వివరాల ప్రకారం ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 60 టీఎంసీలకు గాను ప్రస్తుతం కేవలం 15 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ, తక్కువ నీటితో సాగయ్యే పత్తి, కందులు, పెసలు, మినుములు, జొన్న, సజ్జ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారి కల్వల సతీష్ సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (ఏఓ) సతీష్, సర్పంచ్‌లు ఆంబోతు రవికుమార్, కొమురయ్య, గడ్డల విమల, రాజయ్య, బాపు, లోకేష్, ఏఈవో లు యాస్మిన్ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.60 వేల చెక్కు అందజేత

**జహీరాబాద్/ఝరాసంగం, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఝరాసంగం మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన సంగం మానయ్య వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును మహబత్‌పూర్ గ్రామ సర్పంచ్ ఎల్గోయి లక్ష్మణ్ మంగళవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధులు త్వరగా మంజూరయ్యాయని తెలిపారు. లబ్ధిదారుడి కుటుంబం మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపింది.



# అదనపు కలెక్టర్‌కు జిల్లా ఉపసర్పంచుల ఫోరం వినతిపత్రం సమర్పణ

**శంకరపట్నం, జూలై 28 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఆకుబత్తిని విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా ఉపసర్పంచుల ఫోరంఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి మంగళవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించామని ఏవికె తెలిపారు. ఈ వినతి పత్రంలో ఉపసర్పంచుల హక్కులు, బాధ్యతలు, స్థానిక సంస్థల్లో వారి పాత్రను బలోపేతం చేయడానికి పలు డిమాండ్లను పేర్కొన్నారు. ప్రధానంగా ఉపసర్పంచ్‌లకు నెలకు ?5,000, వార్డ్ సభ్యులకు ?3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు,



సంబంధిత స్థానిక వార్డ్ సభ్యుల పేర్లు తప్పనిసరిగా ముద్రించాలి. గ్రామపంచాయతీ స్టాండింగ్ కమిటీలలో ఉపసర్పంచ్‌లను వైస్ చైర్మన్‌లుగా ప్రకటించాలి, గ్రామపంచాయతీ తీర్మానాలపై ఉపసర్పంచ్‌ల సంతకాలను తప్పనిసరి చేయాలి. అదనంగా, ఉపసర్పంచ్‌లకు చట్టపరంగా కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ, గ్రామాభివృద్ధిలో వారికి తగిన గుర్తింపు, అధికారాలు, గౌరవం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. వెంటనే న్యాయమైన ఉపసర్పంచ్ ల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్ ని కోరినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దుస్స కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్, జిల్లాకు చెందిన వివిధ మండలాల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు,ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## మల్లికార్జున నగర్‌లో గుంతల మయమైన రోడ్ల పరిశీలన

**త్వరలో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం: మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్**

**.పటాన్ చెరు, జూలై 28 (తెలంగాణ వాణి):**
రామచంద్రాపురం డివిజన్ పరిధి లోని మల్లికార్జున నగర్ కాలనీలో గుంతల మయంగా మారిన రోడ్లను మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించామని తెలిపారు. ఆ పనుల అనంతరం రోడ్లు దెబ్బతినడంతో వాటి పునర్నిర్మాణానికి గత వారం అధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మరోసారి



కాలనీలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించామని, త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, పదవి లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు కొనసాగిస్తానని పేర్కొన్నారు

# లోన్ పేరుతో మహిళకు సైబర్ వేధింపులు

**రూ.6.70 లక్షల మోసం**
**వెంటనే స్పందించిన బూర్గంపాడు పోలీసులు**
**బూర్గంపాడు జులై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: బూర్గంపాడు మండల కేంద్రంలోని గౌతాపురం కాలనీలో లోన్ ఇప్పిస్తానంటూ ఓ మహిళను నమ్మించి భారీ సైబర్ మోసానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే రుణం ఇప్పిస్తానని చెప్పి నిందితులు బాధితురాలి నుంచి ఆధార్ కార్డు, పాన్ కార్డు సహా వ్యక్తిగత వివరాలను సేకరించారు. అనంతరం గుర్తుతెలియని వ్యక్తి బాధితురాలి ఫోటోను మార్ఫింగ్ చేసి, ఆ ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపుతూ డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియా గ్రూపుల్లో వైరల్ చేస్తామని బెదిరింపులకు దిగాడు. భయాందోళనకు గురైన బాధితురాలి నుంచి విడతల వారీగా మొత్తం రూ.6 లక్షల 70 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బూర్గంపాడు పోలీసులు వెంటనే స్పందించి, అందులో రూ.3 లక్షల 20 వేలను హోల్డ్




చేయించడంలో విజయవంతమయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బూర్గంపాడు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రజలకు పోలీసుల సూచన: రుణాల పేరుతో వ్యక్తిగత పత్రాలు, ఆధార్, పాన్ వివరాలను అపరిచితులకు ఇవ్వొద్దని, మార్ఫింగ్ ఫోటోలు లేదా సైబర్ బెదిరింపులు ఎదురైతే వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 ను సంప్రదించాలని సూచించారు.

## వెంకటాపురం మండల స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.



**ములుగు,(వెంకటాపురం నూగురు)జులై 28(తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా వెంకటాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై మండలంలోని,అభివృద్ధి పనులు,ప్రజా సమస్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖ అధికారులు వైరల్ జ్వరాలు,సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు అవసరమైన సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు,ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,ప్రభుత్వ పథకాలు అర్హులైన,ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షాభావ పరిస్థితులు కారణంగా ఇతర ఆరుతడి పంటలు వేసేందుకు రైతులను సిద్ధం చేయాలని,జలసిరి అంశంపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు ,మండల అధికారులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ఎన్నిక

**ధర్మారం, జులై 28(తెలంగాణ వాణి )**
రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రామగుండం శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు ధర్మారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తుమ్మల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఓరెం చిరంజీవిలను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి. ఏఎంసీ చైర్మన్ లావుడియా రుప్లా నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ 2 అధ్యక్షుడు కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, యూత్ కాంగ్రెస్ పార్టీ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు అశోద అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, ఉప



సర్పంచ్ ఎలిగేటి మల్లేశం, మాజీ వైస్ ఎంపీపీ మేడవేణి తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు పాలకుర్తి రాజేశం గౌడ్, కాడే సూర్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కాంపెల్లి రాజేశం, మాజీ ఎంపీటీసీ తోడేటి రాజలింగయ్య, మాజీ ఉపసర్పంచ్ ఓడ్నాల శంకరయ్య, మాచి వి ఎస్ ఎస్ చైర్మన్ దేవి జనార్ధన్, సీనియర్ నాయకులు దాగేటి ఉదయ్, జంగ మహేందర్, కంసాని ఎల్లయ్య, పెరుమాండ్ల ప్రసాద్, దేవి అఖిల్, పాలకుర్తి సాయి, మేడ వేణి హరీష్, ఎండి రఫీక్, దేవి లావణ్య పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత

**టీమ్ సంభవ ఫౌండేషన్ ద్వారా రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేసిన మెహర్ ప్రకాష్**

**ఖమ్మం, జూలై 28 (తెలంగాణ వాణి)**
ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తూ, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న గిరిజన విద్యార్థినికి టీమ్ సంభవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మెహర్ ప్రకాష్ రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల, ఖమ్మంలో డిగ్రీ పూర్తి చేసిన జి. శృతికి సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో మాలిక్యులర్ బయాలజీ విభాగంలో ప్రవేశం లభించింది. అడ్మిషన్ కోసం రూ.24,750 ఫీజు చెల్లించాల్సి ఉండగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని బూర్గంపహాడ్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు రూప్లా నాయక్ ద్వారా తెలుసుకున్న మెహర్ ప్రకాష్, టీమ్ సంభవ ఫౌండేషన్ తరఫున వెంటనే స్పందించి విద్యార్థిని శృతికి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థిని శృతి మెహర్ ప్రకాష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు ఉన్నత విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు.



## అలంకరణకు కాదు ఆరోగ్యప్రదాయని గోరింటాకు

**శంకరపట్నం, జూలై 28:(తెలంగాణ వాణి)**
మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు నీరజ ఆధ్వర్యంలో విద్యార్థినులతో మంగళవారం మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోరింటాకు తయారీ, ప్రత్యేకతలు, గోరింటాకు చేసే మేలును విద్యార్థులకు వివరించారు. శుభకార్యాలు, శుభ సందర్భాలలో బాలికలు, యువతులు, మహిళలు వేసుకునే గోరింటాకు అలంకరణకు మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఉపయోగపడుతుందని, ఇది శరీరంలోని అధిక వేడిని, తగ్గించడమే కాకుండా ఫంగస్, బ్యాక్టీరియా లాంటి వాటిని నిరోధిస్తుందని తెలిపారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడానికి శాస్త్రీయ కారణాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు..

## విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి.




**ఖమ్మం, మధిర జూలై:28 (తెలంగాణ వాణి)**
:- పవర్ జేఏసీ నిరసన. యాదాద్రి పవర్ జనరేటింగ్ స్టేషన్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని,విద్యుత్ ఉద్యోగులకు పిఆర్సి,అమలు చేయాలని,ఖాళీలు పోస్టులు,భర్తీ చేయాలని,అందరికీ పెన్షన్ సౌకర్యం కలగజేయాలని, ఆర్టిజన్ సమస్యల పరిష్కరించాలని,పెన్షనర్లకు మెడికల్ సౌకర్యం కల్పించాలని,రెగ్యులర్ ప్రమోషన్ లు ఇవ్వాలని తదితర 14 డిమాండ్లతో రాష్ట్ర పవర్ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగముగా, ఈరోజు మధిర డివిజనల్ ఇంజనీర్ వారి కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసనను వ్యక్తము చేసినారు. ఈ కార్యక్రమంలో పవర్ జేఏసీ జిల్లా కన్వీనర్ వై వి ఆనంద్ కుమార్,ముఖ్య అతిథిగా డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు,ఏ డి ఈ అనూరాధ,ట్రేడ్ యూనియన్ ల నాయకులు,1104,కే శ్రీనివాసరావు,327, నాయకులు నర్సిరెడ్డి, సిఐటియు నాయకులు ఎం.ప్రసాద్,ఇంజనీర్స్ నాయకులు రామకృష్ణ, డిప్లమా ఇంజనీర్స్ నాయకులు శ్రీధర్,మధిర పట్టణ ఏ ఇ అనిల్ మరియు కోటేశ్వరరావు, హుస్సేన్, రాజరత్నం,శ్రీధర్,సాయి శ్రీధర్, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉద్యోగులు కార్మికులు,పాల్గొన్నారు...

## నూతన కలెక్టరేట్ చివరి దశ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



**ములుగు,జులై28(తెలంగాణ వాణి)**
:నూతన కలెక్టరేట్ భవన సముదాయంలో కొనసాగుతున్న చివరి దశ సుందరీకరణ పనులను వేగవంతం చేసి,నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన సముదాయంలో చేపడుతున్న ల్యాండ్‌స్కేపింగ్,అంతర్గత రహదారులు, పచ్చదనం,విద్యుత్ దీపాల ఏర్పాటు,పార్కింగ్,తాగునీటి సౌకర్యం,పారిశుద్ధ్యం,ఉద్యానవన అభివృద్ధి తదితర పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అన్ని శాఖల సేవలు ఒకే చోట మెరుగైన వాతావరణంలో అందించే విధంగా నూతన కలెక్టరేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అన్నార .మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, భవన సముదాయం పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## ఆగస్టు 4న బస్ భవన్ ముట్టడి విజయవంతం చేయాలి

**ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్ తక్షణమే చెల్లించాలి: వాకిటి శ్రీధర్**



**వనపర్తి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ ఏరియర్స్, పదవీ విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె. సత్యన్న, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంచంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 4న హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద చేపట్టనున్న ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్రాంత ఉద్యోగులకు పిలుపునిచ్చారు. 017 నుంచి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, అలాగే ఇప్పటివరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరికీ రావలసిన అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రెండు నెలలకు సరిపడా మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోతే బస్ భవన్ ముట్టడి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రామ్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్, ఎస్.ఎం. అలీ, లక్ష్మీనారాయణ, స్వామి గౌడ్, గోపాల్‌రెడ్డి తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీవాణి హైస్కూల్‌లో వైభవంగా బోనాల పండుగ వేడుకలు

**తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బోనాల ఉత్సవం**



**వనపర్తి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాణి హైస్కూల్లో శ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాళ్లు లత, అంజని మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అధికారిక పండుగ అని పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధ, ఐక్యతతో జరుపుకునే ఈ పండుగ ద్వారా విద్యార్థులు తమ సంస్కృతి, చారిత్రక వారసత్వాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు బోనాల పండుగ విశిష్టతను ప్రతిబింబించే సంప్రదాయ వేషధారణలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణ, నాగేంద్రమ్మ, శాంత, సంధ్య, చైతన్య, నాగలక్ష్మి, రుచి, తెలుగు తిరుమలేష్, నసీమ్, రాజశేఖర్, వెంకటేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

**ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి: సీపీఎం**




**చౌటుప్పల్, జూలై 28 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాల్లో అక్రమ మార్పులు, ఓట్ల తొలగింపు ప్రయత్నాలను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో రాగీరు కిష్టయ్య అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగాలు, సంక్షేమ హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా జరగాలని, ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షించబడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే చౌటుప్పల్ మండలంలోని పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేనిపక్షంలో నిరుద్యోగులను సమీకరించి విస్తృత ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, కార్యదర్శివర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, మండల కమిటీ సభ్యులు అంతటి అశోక్, పొట్ట శ్రీనివాస్, పల్లె మధుకృష్ణ, జక్కిడి దేవేందర్ రెడ్డి, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, కొండే శ్రీశైలం, ఎలమల్ల సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత

**దేవలమ్మ నాగారం గ్రామంలో వనమహోత్సవం**



**చౌటుప్పల్, జూలై 28 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని దేవలమ్మ నాగారం గ్రామ సర్పంచ్ గౌరి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఆయన మొక్కలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఇంటికి కనీసం రెండు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని సూచించారు. మొక్కల పెంపకంతో అటవీ విస్తీర్ణం పెరిగి పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. పుట్టినరోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఒక్కొక్కరు ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుర్కంటి అనూప్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి రమేష్, బొమ్మ అమరావతి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ ఫ్రాడ్ కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

- **ప్రభుత్వ ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.70 లక్షల మేర మోసం**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**



**నార్నూర్, జులై : 28 ( తెలంగాణ వాణి )**
ప్రభుత్వ ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తామని అమాయక నిరుద్యోగులను నమ్మించి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి మోసాలకు పాల్పడిన 4 గురు నిందితులను నార్నూర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. నార్నూర్ పోలీస్ స్టేషన్ క్రైం నెం. 46/2026, సెక్షన్లు 420, 409, 467 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పాథమిక విచారణలో నిందితుడు చహకాటి లింబారావు తాను ప్రభుత్వ ఉద్యోగి (డి. టి. ఓ )నని తప్పుడు ప్రచారం చేసుకుంటూ, తనకు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని నమ్మబలికి ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ రకాల రుణాలు ఇప్పిస్తామని చెప్పి ప్రవీణ్, ఉదయ్,రవీందర్ లతో కలిసి పలువురి వద్ద భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు గుర్తించారు. బాధితులకు నకిలీ జాయినింగ్ లెటర్లు ఇచ్చి మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో ఫిర్యాదుదారు తోడసం గజానంద్ వద్ద రూ.4 లక్షలు తీసుకుని నకిలీ జాయినింగ్ లెటర్ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే జన్నారం ప్రాంతానికి చెందిన ముగ్గురు, ఇంద్రవెల్లికి చెందిన ఇద్దరితో పాటు ఇప్పటివరకు సుమారు 25 మంది వద్ద నుంచి రూ.70 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాలు, రుణాల పేరుతో డబ్బులు కోరే వ్యక్తులను నమ్మకుండా ముందుగా సంబంధిత శాఖల ద్వారా పూర్తి వివరాలు నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్నూర్ ఎస్సై శ్రీ సాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన మంత్రి పొంగులేటి

**ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**



**నర్సంపేట, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రమాదకరంగా మారిన బీబీపేట్ వంతెన



**ఎల్లారెడ్డి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలోని దెబ్బతిన్న వంతెన స్థానంలో వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని మాజీ ఎంపీటీసీ కొరివి నరసింహులు డిమాండ్ చేశారు. గత వర్షాకాలంలో దెబ్బతిన్న వంతెన వద్ద ప్రస్తుతం భారీ గుంతలు ఏర్పడి, రాత్రి వేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కామారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, మెదక్ జిల్లాలను అనుసంధానించే ప్రధాన రహదారిపై ఉన్న ఈ వంతెనను అత్యవసరంగా పునర్నిర్మించాలని కోరారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బీబీపేట్ గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారని తెలిపారు.

# రహదారి అభివృద్ధి పనులకు కేంద్రానికి వినతి

**మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**హనుమకొండ, జూలై 28 (తెలంగాణ వాణి స్టాఫ్ రిపోర్టర్):**
వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారులపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కరుణాపురం--పెద్దపెండ్యాల--నర్సింగరావుపల్లి--ఎలుకుర్తి--ధర్మసాగర్--దేవునూర్--సోమదేవరపల్లి--దామెర--ఎల్కతుర్తి వరకు రహదారిని విస్తరించి బలోపేతం చేయాలని కోరారు. ఈ మార్గం జాతీయ రహదారులు 163, 563లను అనుసంధానించే కీలక రహదారి కావడంతో ట్రాఫిక్‌కు ఎంతో ఉపయోగకరమని వివరించారు. అలాగే యాదాద్రి--వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163)పై నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల లింకులను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రమాదాలు తగ్గి స్థానిక ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా సీఆర్ఐఎఫ్ 2025--26 కింద నర్సంపేట--నందిగామ రహదారి విస్తరణ, భట్టుపల్లి--హంటర్ రోడ్ అభివృద్ధి పనులకు కూడా ఆమోదం తెలపాలని కోరారు. ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.

## నగర అందాలు ప్రతిష్ఠకు ప్రతీకలు: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న



**హనుమకొండ, జూలై 28 (తెలంగాణ వాణి):**
నగరంలోని పార్కులు, ప్రధాన ప్రవేశ ద్వారాలు ((గ్రాండ్ ఎంట్రెన్స్‌లు) నగర ప్రతిష్ఠను ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం పబ్లిక్ గార్డెన్స్, ఎల్లాపూర్ నర్సరీ, కరీంనగర్, ములుగు గ్రాండ్ ఎంట్రెన్స్‌లు, హసన్‌పర్తి ఏబీసీ కేంద్రాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కులను పరిశుభ్రంగా ఉంచడం, కలుపు మొక్కలను తొలగించడం, నర్సరీల్లో ఆరోగ్యవంతమైన మొక్కలను సిద్ధం చేయడం, ప్రవేశ ద్వారాలను హరితీకరణతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ పట్టణ కమిటీ ఎన్నిక




**రామకృష్ణాపూర్,జూలై 28 (తెలంగాణ వాణి):**
ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ పట్టణ మహాసభలు సోమవారం సాయంత్రం ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేకల దాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లతో కార్మికుల హక్కులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. కాంట్రాక్ట్, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 2న నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ పట్టణ అధ్యక్షుడిగా కాదాని సాంబయ్య, కార్యదర్శిగా మండల శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దేవానంద్, ఉపాధ్యక్షుడిగా హుస్సేన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గిరి, షకీర్, కోశాధికారిగా రమేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి నాయకులు, కార్మికులు అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## జైపాల్ రెడ్డికి ఘన నివాళి

**రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచిన మహానేత: డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**



**వనపర్తి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ ఎస్. జైపాల్ రెడ్డి ఏడవ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని ఆయన సమాధి వద్ద రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, జైపాల్ రెడ్డి రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. తెలంగాణతో పాటు దేశ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆలోచనలు, ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శకమని, వాటి సాధనకు కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**అయ్యప్ప, శివాంజనేయ స్వామి ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రార్థనలు**



**నర్సంపేట, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల్లోకి రావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి, శివాంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కలపెల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు ప్రార్థిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఆయన నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని, భగవంతుని ఆశీస్సులతో పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.58 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ

**గాంధారి మార్కెట్ యార్డులో సీసీ రోడ్డు, కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రారంభం**



**ఎల్లారెడ్డి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీలో సుమారు రూ.58 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగసాని శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, స్థానిక సర్పంచ్ రేణుక--సంజీవ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాపురావు పటేల్ సేవలు చిరస్మరణీయం

### భోస్లే మోహన్‌రావు పటేల్

**నిర్మల్--బాసర, జూలై 28 (తెలంగాణ వాణి):**
బాసర మండలం కౌట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ, రెండుసార్లు సర్పంచ్‌గా పనిచేసిన బాపురావు పటేల్ ఆకస్మిక మృతి పట్ల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పజా సేవకు అంకితభావంతో పనిచేసిన బాపురావు పటేల్ గ్రామాభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన మృతి ప్రజలకు తీరని లోటని పేర్కొంటూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఏరియా ఆసుపత్రిలో సీఎంఓ ఆకస్మిక తనిఖీ



**రామకృష్ణాపూర్, జూలై 28 (తెలంగాణ వాణి):**
సింగరేణి సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఓపీ, క్యాజువాలిటీ, ఇతర వైద్య విభాగాలను పరిశీలించి రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, ఇతర సిబ్బంది సమిష్టి కృషిని అభినందించిన ఆయన, ఆసుపత్రి పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తున్న డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. మధు కుమార్‌ను ప్రశంసించారు. రోగుల వైద్య సేవల విషయంలో సింగరేణి సంస్థ రాజీపడదని, అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యం అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు.సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కిరణ్ రాజ్ సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదార్ సాహెబ్, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిక్కచ్చిగా విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచాలి

**కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతికత వినియోగించాలి: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య**



**నిజామాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంచే విధంగా ప్రతి పోలీసు సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. మంగళవారం టౌన్--3 పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కేసుల దర్యాప్తు, రికార్డులు, స్టేషన్ పనితీరును సమీక్షించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను వేగంగా, నాణ్యంగా పూర్తి చేయాలని, దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, డ్రగ్స్, రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కాలనీల్లో ప్రజలతో మమేకమై సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలని, హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో ఏసీపీ ప్రకాశ్ యాదవ్, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్ఐ హరిబాబు, ఎస్ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేశవ్‌గూడ మాజీ ఉపసర్పంచ్ తులసీరామ్ కాంగ్రెస్‌లో చేరిక



**బోథ్, జూలై 28 (తెలంగాణ వాణి):**
సోనాల మండలం కేశవ్‌గూడ మాజీ ఉపసర్పంచ్ తులసీరామ్ మాజీ ఎంపీ సోయం బాపురావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సోయం బాపురావు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతో పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. తులసీరామ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తూ, ప్రజాసేవలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు వినోద్ చౌహాన్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్, డీసీసీ కార్యదర్శి లోలపు పోశెట్టి, మార్కెట్ డైరెక్టర్ సోమన్న, ఘనపూర్ సర్పంచ్ మడవి రమాదేవి, భీంరావు పాటిల్, సదాశివ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందూరు కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

### సీడీఎంఏ శ్రీదేవిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

**నిజామాబాద్ జులై 28:**
**(తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిజామాబాద్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. సీడీఎంఏ శ్రీదేవిని హైదరాబాద్ లోని కార్యాలయంలో కలిసి పలు అంశాలపై మాట్లాడారు. ప్రధానంగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పై దృష్టి పెట్టాలని తెలిపారు. ఇందూరు అభివృద్ధి కొరకు నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే కార్పొరేషన్ కు రావాల్సిన జనరల్ ఫండ్, ఇతర పనులను మంజూరు చేయాలన్నారు.



# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**నిర్మల్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని జిల్లాల మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి ధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు. 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి




వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సూచనలను రైతులకు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంట మార్పిడి ద్వారా విజయాలు సాధించిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. సోన్ మండల రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఉత్తమ సేవలందించిన రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ సంతోష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**భూగర్భ జలాల సంరక్షణకు రైతులు ఫామ్ పాండ్లు నిర్మించుకోవాలి**
**నిర్మల్, జూలై 28 (తెలంగాణ వాణి)**
: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.
ంగళవారం నిర్మల్ గ్రామీణ మండలం కౌట్ల (కె) గ్రామంలో పర్యటించిన కలెక్టర్, లబ్ధిదారురాలు మూడ నాగవ్వ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఇంటిని పరిశీలించారు. నిర్మాణానికి ఇప్పటివరకు అందిన నిధులు, పనుల పురోగతిపై లబ్ధిదారురాలిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, సొంత స్థలం ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే గ్రామంలో మిగిలిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను, ఫామ్ పాండ్‌ను పరిశీలించిన కలెక్టర్, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి



మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణ కోసం రైతులు విస్తృతంగా ఫామ్ పాండ్ల నిర్మాణానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీఓ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సర్పంచ్ దుమాల రాజు, ఉపసర్పంచ్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తి

**కృషి చేసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే మదన్ మోహన్ అభినందనలు**
**ఎల్లారెడ్డి, జూలై 28 (తెలంగాణ వాణి)**



: ఎల్లారెడ్డి మండలంలోని 44 పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100 శాతం విజయవం తంగా పూర్తి చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భ ంగా బీఎల్ఏలు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, సూపర్‌వైజర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రక్రియను విజయవంతం చేశారని ప్రశంసించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమంలో ప్రతి ఒక్కరి అంకితభావం అభినందనీయమని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఏకరూప దుస్తులు సకాలంలో అందించాలి

**నాణ్యతలో రాజీ వద్దు: అదనపు కలెక్టర్ చంద్రయ్య**
**మంచిర్యాల,జూలై 28 (తెలంగాణ వాణి):**
విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులను నిర్ణీత సమయంలోగా అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కుట్టు కేంద్రాలను ఆయన పరిశీలించారు.కుట్టు పనుల పురోగతిని మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్న ఆయన, పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి కొలతలను సరిగ్గా తీసుకుని, వాటికి అనుగుణంగా దుస్తులు కుట్టాలని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ, ఉపాధి పథకాలను



అమలు చేస్తోందని చంద్రయ్య తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సుభాష్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాపురావు పటేల్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి సంతాపం



**నిర్మల్--బాసర, జూలై 28 (తెలంగాణ వాణి):**
బాసర మండలం కౌట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ, రెండుసార్లు సర్పంచ్‌గా సేవలందించిన బాపురావు పటేల్ ఆకస్మిక మృతి పట్ల ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాపురావు పటేల్ ప్రజాసేవకు అంకితభావంతో పని చేసిన నాయకుడని కొనియాడిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో సూచనలు**
**వనపర్తి, జూలై 28 (తెలంగాణ వాణి):**
ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం పెబ్బేరు మండలం శాఖాపూర్ (వై) గ్రామ రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొన్న కలెక్టర్, హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వర్చువల్‌గా ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కందులు, మినుములు, వేరుశెనగ, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాలతో శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని తెలిపారు.



అనంతరం రైతులకు మినుముల విత్తనాలు పంపిణీ చేసి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులు, వ్యవసాయ శాఖ అధికారులను ప్రశంసా పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల్లో హెచ్‌పీవీపై అవగాహన కార్యక్రమం



**నిర్మల్--భైంసా, జూలై 28 (తెలంగాణ వాణి):**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ హైస్కూల్, సర్వేశ్వర్ హైస్కూల్‌లలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. కమలేష్, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కలీమ్ ఉద్దీన్ మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుందని, హెచ్‌పీవీ టీకా ద్వారా దీనిని గణనీయంగా నివారించవచ్చని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని, ఆరోగ్యంపై అపోహలను నమ్మకుండా వైద్యుల సూచనలు అనుసరించాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు



## బెరాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

### శిబిరాన్ని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి):**
మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో బెరాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమాజ సేవలో భాగంగా ఇటువంటి శిబిరాల నిర్వహణ ఎంతో ఉపయోగకరమని అన్నారు. శిబిరంలో గుండె, మహిళా, చిన్నారులు, ఎముకలు, చర్మం, నేత్ర, దంత, ఈఎన్‌టీ, న్యూరాలజీ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, 18 రకాల రక్త పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్, ఎక్స్‌రే, కంటి పరీక్షలు, అర్హులకు ఉచిత కళ్లజోడ్లు, మందుల పంపిణీ వంటి సేవలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ యేసుపాదం, సత్యరాజ్, లక్ష్మణ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, గుమ్మడి శ్రీనివాస్, పితాని శ్రీనివాస్, పూర్ణ, వైద్యుల పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తవుతున్న రోడ్లు

**చిగురుమామిడి జులై 28 ( తెలంగాణ వాణి విలేఖరి )**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో, చినుకు పడితే చాలు, చిత్తవుతున్న సిసి రోడ్లు ,తార్ రోడ్లు, చిన్న చిన్న గుంతలు ఉండటంతో గుంతల్లో నీళ్లు నిలిచి ప్రమాద కరంగా మారుతున్నాయని, ప్రయాణికులు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంబాడి పల్లె గ్రామం నుండి చిగురుమామిడి వెళ్లే దారిలో, చిగురుమామిడి శివాలయం ప్రక్కనే, గొయ్యి వుండటం తో, నీళ్లు నిలిచి, ప్రమాదకరంగా మారిన గుంత, శివాలయం ప్రక్కన మూలమలుపు కావడంతో కరీంనగర్ నుండి హుస్నాబాద్ వెళ్లే వాహనాలు ఎక్కువగా వుండటం తో , గుంతల్లో నీళ్లు నిలిచి, వాహనదారులకు, ప్రమాదకరంగా ఉన్నదని, వారు తెలిపారు. గుంతలు పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని ఆర్ అండ్ బి అధికారులను గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని కోరుతున్న ప్రయాణికులు ,రెండు గ్రామాల ప్రజలు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ఆమనగల్లు వాసి మృతి

ఆమనగల్లు : ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. మాడ్గుల మండల కేంద్రానికి చెందిన పట్టాభి శేఖర్ రెడ్డి, శశిరేఖ దంపతుల కుమార్తె అయిన దీపారెడ్డికి 20 ఏళ్ల క్రితం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డితో వివాహమైంది. దంపతులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తూ న్యూజెర్సీలో స్థిరపడ్డారు. సిగ్నల్ వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు ఆగి ఉండగా, మరో కారు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలపాలై ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఈటల దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



**జమ్మికుంట, జూలై 28 (తెలంగాణ వాణి)**
: బీజేపీ మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్--జమున దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈటల రాజేందర్ ప్రజాసేవలో మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూడు నెలలుగా వేతనాలు లేక ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన



**ఇబ్రహీంపట్నం, జూలై 28 (తెలంగాణ వాణి):**
మూడు నెలలుగా గౌరవ వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు పే స్కేల్, ప్రమాద బీమా, పెట్రోల్ అలవెన్స్ అమలు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షుడు కర్కా సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కరీంనగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ స్కాం

- **రూ.30 లక్షలకు పైగా అక్రమ వసూళ్లు**
- **నలుగురు పోలీసుల సస్పెన్షన్**



**తిమ్మాపూర్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పేరుతో రూ.30 లక్షలకు పైగా అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఆర్‌ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ సాయి, ట్రాఫిక్ విభాగానికి చెందిన మరో ఇద్దరు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. టాస్‌ఫోర్స్ దర్యాప్తులో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల నుంచి కేసు తీవ్రతను బట్టి రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసి, బ్రీత్ అనలైజర్ రికార్డుల్లో మార్పులు చేసి కేసులు నమోదు చేయకుండా వదిలేసినట్లు తేలింది. ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదుతో ఈ అక్రమాలు బయటపడగా, ఇప్పటివరకు 110 కేసుల్లో అక్రమ వసూళ్లు జరిగినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని, గతంలో నమోదైన ఇతర డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపైనా అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## పారదర్శకంగా పనికిరాని విద్యుత్, కంప్యూటర్ సామగ్రి వేలం





**జగిత్యాల: జులై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వినియోగానికి పనికిరాని విద్యుత్, కంప్యూటర్ సామగ్రికి నిర్వహించిన బహిరంగ వేలం పారదర్శకంగా ముగిసింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ పర్యవేక్షణలో యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తం ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాలో జమ చేయనున్నట్లు అదనపు ఎస్పీ చేతన్ నితిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఎస్ఐలు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**రెండో విడతకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి: ఎమ్మెల్యే కూనంనేని**

**కొత్తగూడెం, జూలై 28 (తెలంగాణ వాణి):**
మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్, ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణం



పూర్తి చేయాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగా పక్కా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, చుంచుపల్లి ఎంపిడివో సుభాషిణి, లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో సుస్మిత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు

## 12వ వేజ్ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలి : ఐఎన్‌టీయూసీ

**నూతన బొగ్గు గనుల సాధనకు ఒత్తిడి పెంచుతాం**

**కొత్తగూడెం సింగరేణి, జూలై 28 (తెలంగాణ వాణి)**
గోదావరిఖనిలో జరిగిన ఐఎన్‌టీయూసీ కోర్ కమిటీ సమావేశ నిర్ణయాలను కొత్తగూడెం ఏరియా నాయకులకు వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ వివరించారు. 12వ జేబీసీసీఐ వేజ్ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి వేతన సవరణ చేపట్టాలని, నూతన బొగ్గు గనుల కేటాయింపునకు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. కార్మికుల పెండింగ్ హామీలు, పర్క్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటి పథకం, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, గనుల్లో భద్రతా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జీదుల రాజేశ్వరరావు, సెంట్రల్ కమిటీ మెంబర్ పోశం శ్రీనివాస్ విప్లవ్, ఫిట్ కార్యదర్శులు గోపు కుమారస్వామి, ఎండి సత్తార్ పాషా, ఈ.మోహన్ రెడ్డి, సాగర్, బొద్దుల రవీందర్, భాను కమల్, కే.నాగేశ్వరరావు, కే.కుమార్, జల్లి



కిరణ్, కే.కృష్ణమోహన్, మజీద్, భరత్, బొజ్జ వెంకటేశ్వర్లు, చందులాల్, కే.శ్రీనివాస్, ఎస్.డి.యాకుబుద్దీన్, ఎస్.కే.గులాం గౌస్, సాయి, పృధ్వి, వల్లాల సాంబశివరావు, డేవిడ్ రాజ్, జోసెఫ్ లెనిన్ బాబు, రహీం, టి.శ్రీనివాస్, కే.వెంకటేశ్వరరావు, నవీన్, విజయ్ కుమార్, లగ్గాల అజయ్, క్రాంతి కుమార్, వినోద్ బూన్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్

**హైదరాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి):**
కొండాపూర్, అంజయ్యనగర్ డివిజన్లలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకుని, నిర్దేశిత గడువులోగా 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని సూచించారు. పతి అర్హత కలిగిన ఓటరు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పాల్గొని బీఎల్ఓలకు అవసరమైన వివరాలు అందించి సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## హుస్నాబాద్ మున్సిపల్ ప్రజాప్రతినిధులకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణపై అవగాహన కార్యక్రమం

**హుస్నాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి ఆర్సి)**
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుల కోసం కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమంనిర్వహించారు. ఈ శిక్షణలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2026, జల్ సంచయ్--జన్ భాగిదారి, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం పనితీరు, తెలంగాణ మున్సిపల్ చట్టం 2019, అమృత్ సబ్ స్కీమ్స్, క్యాచ్ ది రెయిన్ వంటి కీలక అంశాలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. పట్టణాల అభివృద్ధి, పారిశుధ్యం, వర్షపు నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రజాప్రతినిధుల పాత్రపై ప్రత్యేకంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలోహుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు బూరుగు లత, పిల్లి తిరుపతి, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి




శ్రీనివాస్, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదెపాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప,గోపగోని శోభన్ బాబుతో పాటు కో-ఆప్షన్ సభ్యులు ఎం.డి. హసన్, భూక్య సరోజన పాల్గొన్నారు. శిక్షణ ద్వారా పట్టణ పాలనలో సమర్థవంతమైన సేవలు అందించేందుకు అవసరమై న అంశాలపై విలువైన సమాచారం పొందినట్లు తెలిపారు.

## గంగనాల ఆయకట్టుకు నీటి విడుదల చేయాలి : బీజేపీ



**ఇబ్రహీంపట్నం, జూలై 28 (తెలంగాణ వాణి):**
భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి మాట్లాడుతూ, సదర్‌మాట్ ప్రాజెక్టు నుంచి గంగనాల ఆయకట్టుకు వెంటనే సాగునీరు విడుదల చేసి రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాదాపు 300 ఎకరాల భూమిని రైతులు ఇచ్చినా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శిలు సుంచు రణధీర్,పంతంగి వెంకటేష్ యదవ్, జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గడ్డం సంజీవ్ రెడ్డి,రాపెల్లి సురేష్ బీజేవైఎం మండల అధ్యక్షులు బోడ నవీన్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సురేష్, బీజేవైఎం నాయకులు భాస్కర్, బూత్ అధ్యక్షులు శ్రీకాంత్, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనాన్ని వెంటనే అప్పగించాలి

**జిల్లా యంత్రాంగానికి రిటైర్డ్ ఉద్యోగుల వినతి**

**హుస్నాబాద్ జూలై 28 (తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో తాత్కాలికంగా కొనసాగుతున్న గ్రంథాలయాన్ని వెంటనే ప్రత్యామ్నాయ భవనానికి తరలించి, సంఘ భవనాన్ని పూర్తిస్థాయిలో రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలకు అందుబాటు లోకి తీసుకురావాలని కోరుతూ సంఘం నాయకులు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రంసమర్పించారు. ఈసందర్భంగాహుస్నాబాద్ డివిజన్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తక్కలపల్లి రాజగోపాల్ రావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనం ఉద్యోగుల సంక్షేమం, సమావేశాలు, వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అనేక సేవా కార్యక్రమాల కోసం నిర్మించబడిందని తెలిపారు. అయితే గత కొన్ని నెలలుగా అదే భవనంలో తాత్కాలికంగా ప్రభుత్వ గ్రంథాలయం కొనసాగుతుండటంతో సంఘ కార్యకలాపాల నిర్వహణకు తీవ్ర అంతరాయంకలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయం ప్రజలకు అవసరమైన సేవా కేంద్రం అయినప్పటికీ, దానిని అనువైన ప్రత్యామ్నాయ ప్రభుత్వ భవనానికి తరలిస్తే ప్రజలకు కూడా ఇబ్బందులు ఉండవని, మరోవైపు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తన భవనంలో నిరాటంకంగా



సేవాకార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ వినతిని సానుకూలంగాపరిశీలించిగ్రంథాలయాన్ని త్వరితగతిన వేరే ప్రదేశానికి తరలించి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘభవనాన్ని పూర్తిగా సంఘానికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను ప్రభుత్వం, అధికారులు అత్యవసరం గాపరిగణించి తగినచర్యలుతీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఉద్యోగుల హుస్నాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. లింగారెడ్డి, ఆర్థిక కార్యదర్శి చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఆర్. రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జైన్ సత్యం, జిల్లా ఉపాధ్యక్షుడు కృపాసాగర్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వీణవంక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏసీపీ మాధవి



**వీణవంక, జూలై 28 (తెలంగాణ వాణి):**
హుజురాబాద్ ఏసీపీ మాధవి మంగళవారం వీణవంక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మర్యాద పూర్వకంగా సేవలందించాలని, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసులను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే బీట్ పోలీసింగ్, రాత్రి గస్తీ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ తనిఖీలో రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్సై తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్

**కోరుట్ల రూరల్, జూలై 28 (తెలంగాణ వాణి):**
గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. కోరుట్లలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో చెత్తను పొడి, తడి, ఎలక్ట్రానిక్, వైద్య వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వర్గీకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రతి





కుటుంబానికి దీనిపై అవగాహన కల్పించాలని, సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, వీబీజీఆర్‌ఏఎం నిధులను శాశ్వత ఆస్తుల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. గ్రామసభల ద్వారా పారిశుద్ధ్యం, చెత్త వర్గీకరణపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాల బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ అద్దె బస్సు



**జగిత్యాల: జులై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల పట్టణంలోని యవర్ రోడ్ లో సోమవారం ఉదయం పెను ప్రమాదం తృటిలో తప్పింది. దాదాపు 20 మంది విద్యార్థులను తీసుకెళ్తున్న ఓ ప్రైవేటు పాఠశాల బస్సు రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు స్వల్పంగా దెబ్బ తిన్నప్పటికీ, విద్యార్థులకు పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం గురైన బస్సును, పిల్లలను చూసి కలవరపడ్డారు. ప్రమాదానికి గల కారణాలపై జగిత్యాల ట్రాఫిక్ పీఎస్ పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా జగిత్యాల పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

## సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్

**కోరుట్ల రూరల్, జూలై 28 (తెలంగాణ వాణి):**
సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్‌పాండ్, రీచార్జ్ బోర్‌వెల్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం కమ్యూనిటీ సోక్‌పిట్ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రైతులు ఫార్మ్‌పాండ్లు, సోక్‌పిట్ల నిర్మాణానికి ముందుకు రావాలని, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి కరువు పరిస్థితులను ఎదుర్కోవచ్చని కలెక్టర్ తెలిపారు. అనంతరం జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో



నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడివో రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘణపూర్ లో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్



**పటాన్‌చెరు, జూలై 28 (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు నియోజకవర్గం లోని ముత్తంగి డివిజన్ పరిధి ఘణపూర్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, రేణుక ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, రుచికరమైన భోజనం అందించాలి: కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు, జూలై 28 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఆలేరు మండలం కొలనుపాక జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, లక్ష్యాలు, క్రీడలు, భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్యతో పాటు క్రీడలు, డిజిటల్ నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన కలెక్టర్, పాఠశాల మౌలిక వసతులు, తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్ మరియు సిబ్బంది నాగేశ్వర రావు, కరుణాకర్ రవీందర్ శ్వేత శ్రీధర్ లక్ష్మణ్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి: కలెక్టర్ బి. సత్యప్రసాద్




**జగిత్యాల, జూలై 28 (తెలంగాణ వాణి):**
సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్‌పాండ్, రీచార్జ్ బోర్‌వెల్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలకు కలెక్టర్ భూమిపూజ చేశారు. అనంతరం కమ్యూనిటీ సోక్‌పిట్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు ఫార్మ్‌పాండ్లు, సోక్‌పిట్ల నిర్మాణానికి ముందుకు రావాలని, వర్షపు నీటి సంరక్షణతో భూగర్భ జలాలు పెరిగి కరువు పరిస్థితులను ఎదుర్కోవచ్చని తెలిపారు. అనంతరం జోగిన్‌పెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న వీవో భవనం, అంగన్‌వాడీ కేంద్రం పనులను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



**వీణవంక, జులై 28(తెలంగాణ వాణి ప్రతినిధి) :**
హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసా కల్పించాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాల అమలులో జాప్యం చేస్తోందని విమర్శిస్తూ, లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, వీణవంక--జమ్మికుంట ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న కాల్వల పనులను పూర్తి చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి

### నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగు వైపు వెళ్లాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు. ఇప్పటికే పత్తి, కంది వంటి పంటలు సాగు చేసిన రైతులు అంతర పంటలు వేసుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు నేస్తం 100వ ఎపిసోడ్" కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. నల్గొండ జిల్లాలోని దోమలపల్లి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. అల్పపీడన ద్రోణి ప్రభావంతో సెప్టెంబర్‌లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో కూడా వర్షాభావ పరిస్థితులు ఉండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం తగ్గే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో నల్గొండ జిల్లాకు జీవనాధారమైన నాగార్జునసాగర్, ఏఎంఆర్పీ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితులు ఉండకపోవచ్చని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. పత్తి, కంది సాగు చేసిన రైతులు సజ్జ, కొర్రలు, సామలు వంటి పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఉద్యాన పంటలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని, ప్రభుత్వం సబ్సిడీపై బిందు సేద్య పరికరాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆరుతడి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.

**రైతులకు ఉపయోగపడే వేదికగా రైతు నేస్తం**

అంతకుముందు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వాతావరణ పరిస్థితులు, సాగు పద్ధతులు, పంటల ఎంపిక, ఎరువుల వినియోగం, ఆధునిక వ్యవసాయ విధానాలపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. రైతు వేదికలు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య సమన్వయ వేదికలుగా పనిచేస్తున్నాయని, రైతులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఉద్యాన పంటలు, ఆరుతడి పంటల వైపు వెళ్లాలని మంత్రి సూచించారు. సజ్జలు, సామలు, కొర్రలు వంటి పంటలు నీటి కొరత ఉన్నప్పటికీ తక్కువ నీటితో సాగు చేయవచ్చని తెలిపారు. వీటిని అంతర పంటలుగా కూడా వేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్




సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని, ఈ పంటకు పురుగుల బెడద, ఎలుకలు, కోతుల సమస్యలు తక్కువగా ఉంటాయని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచుకుని సాగు చేస్తే రైతులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ డీడీ శేఖర్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కథలాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

- మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, విద్యా బోధనపై సమీక్ష
- నాణ్యమైన విద్యతో పాటు సురక్షిత వాతావరణం కల్పించాలి

**జగిత్యాల: జూలై 28:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, వంటశాల నిర్వహణను పరిశీలించారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో సమీక్ష



నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ ఎం ఎస్. వెంకటేశం, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం

**వలస సుభాష్ ప్రముఖ సంఘ సేవకులు.**
**హుస్నాబాద్ జూలై 28(తెలంగాణ వాణి ఆర్.సి)**
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవ సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రకృతిని నష్టం కలిగిస్తే మానవ మునగడకు ప్రశ్నార్థకం అవుతుందని భూమిని కాపాడుకోవడం మన నైతిక బాధ్యతని ఆయన అన్నారు. ఒక మొక్క నాటుదాం భూమాతను కాపాడుదాం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి ప్రకృతిని ప్రేమిద్దాం పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడికి కర్తవ్యం ఆయన అన్నారు గ్రామీణ పట్టణ యువజన సంఘాలు మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు. అమ్మ పేరున మొక్కలు నాటుదాం పర్యావరణం రక్షిద్దాం అని వారు అన్నారు. జీవవైవిద్యాన్ని సంరక్షించడంవన్యప్రాణులను కాపాడుకుంటూ స్థిరమైన పద్ధతులను స్వీకరించి భావితరులకు చక్కటి భవిష్యత్తును అందిద్దామని ఆయన అన్నారు ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం కాలుష్యాన్ని పారదులుదాం ప్రకృతి విధ్వంసాన్ని ఆపేద్దాం కాలుష్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు మంచి వాతావరణం మంచి గాలి కోసం మొక్కలు పెంచాలని అన్నారు. భావితరాలకు అందమైన ప్రపంచాన్ని అందించేలా కోసం మంచి వాతావరణాన్నికల్పించడం కోసం మొక్కలను సంరక్షణ కోసం కృషి చేద్దామని వారు అన్నారు ఆరోగ్య వంతమైన సమాజం ఉండాలంటే మనం పరిసరాల పరిశుభ్రత



కోసం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని వారు అన్నారు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఒక నినాదాన్ని ప్రకటిస్తున్నాం ఇంటికో చెట్టు ఊరంతవనం అని నినాదాన్ని ముందుకు తీసుకుపోదామని వలస సుభాష్ అన్నారు. వాతావరణంలోని మార్పులు ఇలా ఉంటున్నాయో అందరంచూస్తున్నామని దానికోసం మన విధిగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరం పాటు పడదామని పేర్కొన్నారు.

## హసన్‌పర్తి 66వ డివిజన్‌లో సర్ ప్రక్రియ కొనసాగింపు

**హసన్‌పర్తి, జూలై 28 (జోర్దార్ ప్రతినిధి):**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా హసన్‌పర్తి 66వ డివిజన్‌లో మంగళవారం ఓటర్ రిసీవింగ్, మ్యాపింగ్ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ మాజీ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కాంగ్రెస్ నాయకులు పోతరాజు ప్రభాకర్, జన్ను రవీందర్, తాళ్ల మధు, బీఎల్ఓ రమేష్, గీత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని ఓటర్ల వివరాల నమోదు, మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు




## ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు చొరవతో తాగునీటి బావికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు

### డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు విజ్ఞప్తికి సానుకూల స్పందన

**హసన్‌పర్తి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపురం ఊర చెరువులో ఉన్న తాగునీటి బావికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. బావిలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు పడకుండా కాపాడి తాగునీటి స్వచ్ఛతను పరిరక్షించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేపట్టారు. ఈ సమస్యను 56వ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు దృష్టికి తీసుకెళ్లి, బావికి రక్షణగా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, బావికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు పూర్తయ్యింది. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి వనరులను సంరక్షించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు ఈ చర్య ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.



## కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించాలి

### -హెపటైటిస్ నివారణకు జాగ్రత్తలు పాటించాలి: డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్



**మంచిర్యాల, జూలై 28 (తెలంగాణ వాణి):**
ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్ ఏ, బి, సి, డి, ఇ వైరస్‌ల వల్ల కాలేయ వ్యాధులు వస్తాయని తెలిపారు. కలుషిత రక్తం, సూదులు, నీరు, ఆహారం ద్వారా వ్యాధి వ్యాప్తి హెపటైటిస్‌ను మౌనవ్యాధిగా పేర్కొన్న ఆయన, లక్షణాలు కనిపించకపోయినా కాలేయంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని సూచించారు. ప్రజలు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆసుపత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, బ్లడ్ బ్యాంకులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో హెపటైటిస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా ఎండి బాబర్





**డిండి జులై 28( తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి మండలం తవక్లాపూర్ గ్రామంలో అఖిల భారత యువజన సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా అఖిలభారత యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ విచ్చేసి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ యువతను మోసం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇస్తామని హామీలు ఇచ్చి ఇప్పటికి నోటిఫికేషన్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయి. జాబ్ క్యాలెండర్లను ప్రకటించాలి వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని లేని పక్షంలో యువతను చైతన్యం చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని వారు అన్నారు. యువత ఉద్యమాలతో అవినీతిని అంతం చేసి విజయాలను సాధించాలని వారు అన్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గ్రామ అధ్యక్షులుగా ఎండీ బాబర్, కార్యదర్శి ఎండీ ఆదిల్, ఉపాధ్యక్షులు భూషరాజు రమేష్, సహాయ కార్యదర్శి కడారి వెంకటేష్, కోశాధికారి మీనుగా నవీన్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్షులు ఎలిమినేటి నరేష్, సిపిఐ తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, సైదులు, మహేష్, శ్రీను, మల్లేష్, నాగరాజు, మహేష్, జంగయ్య, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం

వట్‌పల్లి : వట్‌పల్లి మండలంలోని అక్షర పాఠశాలకు చెందిన బస్సు మంగళవారం నిర్జపల్లి, ఉసిరికపల్లి గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకు వస్తున్న సమయంలో రోడ్డు పక్కకు ఒరిగింది. బస్సులో సుమారు 35 మంది విద్యార్థులు ఉండగా, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ జరగలేదు.

# భారత వాయుసేనలో చేరండి

**గీతం విద్యార్థులకు పిలుపునిచ్చిన ఐఏఎఫ్ అధికారి దీపక్ భరద్వాజ్**

**పటాన్ చెరు, జూలై 28, (తెలంగాణ వాణి)**

భారత వైమానిక దళం (ఐఏఎఫ్)లో అధికారులుగా లేదా అగ్నివీరులుగా చేరి దేశ సేవ చేయాలని గీతం విద్యార్థులను భారత వాయు సేనకు చెందిన మాస్టర్ వారెంట్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్ ప్రోత్సహించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'భారత వైమానిక దళ నియామకం: అభివృద్ధి వాహనం -- వృత్తి మార్గదర్శనం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఐఏఎఫ్ సహకారంతో, గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయుధ దళాలలో వృత్తి అవకాశాల గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. పలువురు వాయుసేన అధికారుల బృందంతో వచ్చిన దీపక్ భరద్వాజ్, విద్యార్థుల ప్రయోజనం కోసం భారత వైమానిక దళ సామర్థ్యాలను ప్రదర్శించే ఒక మొబైల్ ఎగ్జిబిషన్, సిములేషన్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.సమావేశాన్ని ఉద్దేశించి దీపక్ భరద్వాజ్ మాట్లాడుతూ, యూపీఎస్సీ, ఏఎఫ్ క్యాట్, ఎన్.సీ.సీ. స్పెషల్ ఎంట్రీ ద్వారా పర్మనెంట్ కమిషన్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్ తో ఐఏఎఫ్ లో చేరవచ్చన్నారు. ఒకసారి ప్రవేశ స్థాయి అధికారిగా చేరాక, వైమానిక దళాధిపతి (చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) పదవి వరకు



ఎదగొచ్చని చెప్పారు. అలాగే ఫ్లయింగ్, టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ విభాగాలతో పాటు, ప్రతి విభాగానికి కావలసిన అర్హత ప్రమాణాలు, అవసరమైన అర్హతల గురించి కూడా ఆయన విపులంగా తెలియ జేశారు. అంతే కాకుండా, ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు (ఐఎఫ్ఎస్బీ) ప్రక్రియను కూడా ఆయన వివరించారు. ఇందులో రాత పరీక్షలు, వ్యక్తిత్వ మదింపు, మానసిక పరీక్షలు, గ్రూపు టాస్క్ లు, ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు, ప్రతిభ ఆధారిత ఎంపిక వంటి అంశాలు కూడా ఉంటాయన్నారు.

శాస్త్రీయ, పారదర్శకమైన ఎంపిక విధానాన్ని ప్రస్ఫుటీకరిస్తూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, నిబద్ధతతో సిద్ధం కావాలని ఆయన ప్రోత్సహించారు. వైమానిక దళ వృత్తి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, దీపక్ భరద్వాజ్ ఆకర్షణీయమైన జీతభత్యాలు, సదుపాయాలతో కూడిన వసతి, సమగ్ర వైద్య సంరక్షణ, విద్యావకాశాలు, సెలవు ప్రయోజనాలు, బీమా సౌకర్యం, సాహస కార్యకలాపాలు, వృత్తిపరమైన అభివృద్ధి గురించి మాట్లాడారు. భారత వైమానిక దళం పరిణామం, జాతీయ భద్రత, సైనిక లాజిస్టిక్స్, మానవతా సహాయం, విపత్తు సహాయం, క్షతగాత్రుల తరలింపులో దాని కీలక పాత్రలతో పాటు 1965, 1971 ఇండో-పాక్ యుద్ధాల సమయంలో దాని సహకారం గురించి కూడా ఒక అవలోకనాన్ని అందించారు. ఐఏఎఫ్ ఆధునిక యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు, గగనతల నిఘా వ్యవస్థలను ఆయన విద్యార్థులకు పరిచయం చేశారు. తొలుత, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వేణు కుమార్ నాతి అతిథులకు స్వాగతించి, సత్కరించగా, కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్, ఇంజనీరింగ్ విద్యార్థులకు వృత్తి అవగాహన కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. అధ్యాపక బృందం, విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఐఏఎఫ్ అధికారులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు

## సహజ సేద్యంతోనే నేలకు, పంటలకు రక్షణ

- రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులేయాలి
- రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



**ఉట్నూర్ (తెలంగాణ వాణి)**

రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పిలుపునిచ్చారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన "రైతు నేస్తం" 100వ ఎపిసోడ్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మితిమీరిన రసాయనాల వాడకం వల్ల నేల సారం దెబ్బతింటుందని, ఆవు పేడ, సేంద్రీయ ఎరువులతో పంటలకు రక్షణ లభిస్తుందన్నారు. జిల్లాలో వర్షపాతం లోటు ఉన్నందున మల్చింగ్, ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై భారీ సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే జిల్లాకు మరో 1,350 మెట్రిక్ టన్నుల డీఏపీ రానుందని, నిలిచిపోయిన రూ.130 కోట్ల జొన్న కొనుగోలు బకాయిలను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని కోరారు. వ్యాపారుల మాటలు నమ్మి నకిలీ విత్తనాలు, ఫెర్టిలైజర్లు కొని మోసపోవద్దని హెచ్చరించారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు స్థానికంగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యవసాయ అధికారులు, ఆదర్శ రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ పరిధిలో సర్ పై అవగాహన

**ప్రజల సమస్యలపై స్పందించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**



**తెల్లాపూర్, జులై 28 (తెలంగాణ వాణి)**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పర్యటించి, ఓటర్లకు 'ఎస్ఐఆర్' (SIR) ప్రక్రియపై అవగాహన కల్పించారు. బిఎల్వోలను కలసి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అనంతరం, స్థానికులు తెల్పిన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ఆమె వెంటనే స్పందించారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్‌ను కలసి ప్రజాసమస్యలను వివరించి, వెంటనే పరిష్కరించాలని కోరగా.. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ధర్మపథం కళావేదికపై నకిరేకల్ నాట్యమండలి సాంప్రదాయ నాట్య ప్రదర్శన




**నకిరేకల్ : జులై 28 (తెలంగాణ వాణి)**



నకిరేకల్ మండలంలోనే ఏకైక నాట్యమండలి శ్రీ నటరాజన్ నాట్యాలయం (కారంగి సుధాకర్), శ్రీ శివ జ్యోతి నాట్యమేల కళాశాల (వెంకటేష్) హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీశైలం మల్లికార్జున స్వామి సన్నిధి ధర్మపథం కళావేదికపై నాట్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహీర, అనిక, వర్ణిక విలాసిని, దిత్యా రెడ్డి , శాన్వి, ఆద్యశ్రీ , యాశ్రీ , శ్రీవల్లి, సుమాలిక, జయంతిక , గోపిక, సాన్విక లు శ్రీశైలం దేవస్థానం నందు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## జీవో 36పై కాంగ్రెస్--బీజేపీ క్రెడిట్ రాజకీయాలు మానాలి: మాజీ మంత్రి జోగు రామన్న




**ఆదిలాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి విడుదలైన జీవో 36ను స్వాగతిస్తున్నామని, అయితే ప్రచారంతో కాకుండా వెంటనే రూ.2,278 కోట్ల నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ ఎయిర్‌పోర్టు ప్రాజెక్టు తన వల్లే వచ్చిందని చెప్పుకోవడం సరికాదని, కేంద్ర ప్రభుత్వ పాత్రను విస్మరించవద్దని అన్నారు. సీసీఐ పరిశ్రమ పునఃప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేయాలని, చనాక--కొరటా బ్యారేజ్ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జీవో 36ను ప్రజల దృష్టి మళ్లించేందుకే తీసుకొచ్చారని ఆరోపించిన ఆయన, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తూ, ప్రస్తుత ఎమ్మెల్యే కొత్తగా తీసుకొచ్చిన నిధులు ఏమిటో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు.?

## ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి: ఉప సర్పంచ్‌ల ఫోరం

**మంచిర్యాల, జూలై 28 (తెలంగాణ వాణి):**

రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు గౌరవ వేతనం మంజూరు చేయాలని ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు అనుమాండ్ల విక్రమ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఉప సర్పంచ్‌లకు నెలకు రూ.5 వేల, వార్డు సభ్యులకు రూ.3 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, విధి నిర్వహణలో మృతిచెందిన ఉప సర్పంచ్‌ల కుటుంబాలకు రూ.5 లక్షలు, వార్డు సభ్యుల కుటుంబాలకు రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అలాగే గ్రామాభివృద్ధి పనుల



శిలాఫలకాలపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పేర్లను పొందుపరచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కాలేయ వ్యాధులపై అవగాహన కల్పించాలి

**-హెపటైటిస్ నివారణకు జాగ్రత్తలు పాటించాలి: డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, జూలై 28 (తెలంగాణ వాణి):**

ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్ ఏ, బి, సి, డి, ఇ వైరస్‌ల వల్ల కాలేయ వ్యాధులు వస్తాయని తెలిపారు.కలుషిత రక్తం, సూదులు, నీరు, ఆహారం ద్వారా వ్యాధి వ్యాప్తి హెపటైటిస్‌ను మౌనవ్యాధిగా పేర్కొన్న ఆయన, లక్షణాలు కనిపించకపోయినా కాలేయంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించాలని సూచించారు. ప్రజలు



అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు.ఆసుపత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, బ్లడ్ బ్యాంకులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో హెపటైటిస్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అధికారులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ జలసిరి విజయవంతానికి మహిళా సంఘాలే కీలకం: ప్రత్యేక అధికారి పి. శ్రీనివాస్

**డిండి, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మహిళా సంఘాల పాత్ర కీలకమని డిండి మండల ప్రత్యేక అధికారి పి. శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎన్. వేజన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇంటికో ఇంకుడు గుంత, పొలానికి ఫార్మ్‌పాండ్, ప్రతి గ్రామానికి ఊటకుంట, సోక్‌పిట్లు, రీచార్జ్ పిట్లు, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. గ్రామసభల్లో తీర్మానాలు అనంతరం వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సీసీలు, వివోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొని జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.



## ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం



**నాగిరెడ్డిపేట మండలం జులై 28: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రోజున ప్రత్యేక అధికారి డి ఎల్ పి వస్తురేందర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా అన్ని గ్రామాల కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామాలకు చెందిన కార్యదర్శులు , సర్పంచులు గ్రామానికి కావలసిన అవసరాలకు తగిన నిధులను మంజూరు చేసి , గ్రామాల అభివృద్ధి కి పాటుపడాలని అధికారులు కోరారు . అన్ని శాఖల అధికారులు తమకు కావలసిన సౌకర్యాలను సకాలంలో అందించాలని కోరారు . ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు తెలియజేశారు . ఈ కార్యక్రమం ఉద్దేశించి డిఎల్పిఓ సురేందర్ , ఎమ్మార్వో బిక్షపతి , ఎంపీడీవో గంగాధర్ , పశువైద్యాధికారి రవికుమార్ లు మాట్లాడారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు ప్రవీణ్ కుమార్ , సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు .

## 100% ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తి

**నాగిరెడ్డిపేట మండలం జులై 28:( తెలంగాణ వాణి ప్రతినిధి)**

నాగిరెడ్డి పేట మండలంలోని వదలపర్తి గ్రామంలో భాగంగా 100% ఎఫ్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తి చేశారు . ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ ప్రక్రియ పూర్తి కావడంలో గ్రామ సర్పంచ్ పద్మా నారాయణ, ఉపసర్పంచ్ శ్యామల గంగారం , కార్యవర్గం, జిపిఓ, గ్రామపంచాయతీ ,సిబ్బంది ,ఆశ వర్కర్ల కృషితో పూర్తయిందని తెలిపారు . ఈ సందర్భంగా సహకరించిన ప్రజాప్రతినిధులు అధికారులు, అనధికారులు గ్రామపంచాయతీ తరఫున కృతజ్ఞతలు గ్రామ కార్యదర్శి తెలిపారు .



## భైంసా రూరల్ పరిధిలో వెండి కడియాల చోరీ కేసు ఛేదన



**నిర్మల్ - భైంసా: జూన్ 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నిర్మల్ జిల్లా భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోతులుగాం గ్రామంలో పూజలు చేస్తామని నమ్మించి ఇంట్లోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు దేవుడి గదిలో భద్రపరిచిన సుమారు ఐదు తులాల బరువున్న రెండు వెండి కడియాలను అపహరించారు. వీటి విలువ సుమారు రూ.15 వేలుగా అంచనా.బాధితుల ఫిర్యాదు మేరకు భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సుప్రియ ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణ ఆధారంగా వేగంగా విచారణ జరిపి,చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి చోరీకి గురైన వెండి కడియాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా అపరిచితులను ధృవీకరించకుండా ఇళ్లలోకి అనుమతించవద్దని ,పూజలు, విరాళాలు లేదా ఇతర కారణాలు చెప్పి వచ్చిన అనుమానాస్పద వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజలకు సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలి

- సీఎస్ సంజయ్ జాజూ
- విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు ఆదేశం

**నిర్మల్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించిన సీఎస్.. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను ప్రోత్సహించాలని, రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎలాంటి విపత్తులు సంభవించినా అధికారులు వెంటనే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ గంగారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులను వదిలితే కఠిన చర్యలు: డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్, జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ పట్టణంలో రోడ్లపై నిర్లక్ష్యంగా పశువులను వదిలిపెట్టే యజమానులపై పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 22 పశువులను గుర్తించి ఇచ్చోడ గోశాలకు తరలించారు. పశువుల నిర్వహణ రుసుము సంబంధిత యజమానులే చెల్లించాలని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. రోడ్లపై పశువులను వదిలి ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించిన ముగ్గురిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ప్రజల భద్రత దృష్ట్యా ఈ తరహా ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, రోడ్లపై పశువులను వదిలే యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలి: మంత్రి సీతక్క

**జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు**





**ములుగు, జూలై 28 (తెలంగాణ వాణి):**
వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే జలసిరి కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ములుగు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం, జలసిరి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామానికి ఊటకుంట, ప్రతి రైతుకు పంటకుంట నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. రాబోయే రెండు రోజుల్లో గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను నిర్ణయించాలని, మహిళా సంఘాలు, రైతులు జలసిరి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలను సాగు చేయాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

## మొక్కలతోనే మానవాళి మనుగడ శంభునిగూడెంలో ఉచితంగా మొక్కల పంపిణీ



**టేకులపల్లి, జూలై 28 (తెలంగాణ వాణి):**
పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని శంభునిగూడెం గ్రామ సర్పంచ్ బట్టు శివ పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలం శంభునిగూడెం గ్రామంలో ప్రతి ఇంటికి నిమ్మ, జామ, ఉసిరి, నేరేడు, ఖర్జూరం వంటి ఫల మొక్కలతో పాటు చామంతి, మందారం, గులాబీ వంటి పూల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అన్వేష్,ఉప సర్పంచ్ శ్రీనివాస్,బట్టు బాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యాలయంలో డిపిఓ ఆకస్మిక తనిఖీ



**బూర్గంపాడు జూలై 28 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిపిఓ గ్రామ పంచాయతీలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అభివృద్ధి పనులు, నిధుల ఖర్చు, పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి సంపత్ శ్రీనివాస్ ను పలు అంశాలపై అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. రికార్డుల నిర్వహణలో మరింత పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఈ తనిఖీ సమయంలో గ్రామ సర్పంచ్ మంద నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న తో పాటు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# కౌన్ బనేగా సింగరేణి జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం..?

- క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సంస్థకు సమర్థవంతమైన అధికారి అవసరం
- కార్మిక సమస్యల పరిష్కారంలో కీలకంగా మారనున్న పర్సనల్ డిపార్ట్‌మెంట్



**కొత్తగూడెం సింగరేణి, జులై 28 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్‌లో ప్రస్తుతం అందరి దృష్టి ఒకే అంశంపై నిలిచింది. అదే జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం పోస్టు. ప్రస్తుతం ఈ బాధ్యతలు నిర్వహిస్తున్న కవిత నాయుడు పదవీ విరమణకు చేరుకోవడంతో, ఈ కీలక స్థానంలో యాజమాన్యం ఎవరిని నియమిస్తుందన్న చర్చ సింగరేణి వర్గాల్లో జోరుగా సాగుతోంది.సింగరేణి సంస్థకు పర్సనల్ డిపార్ట్‌మెంట్ గుండెకాయ లాంటిది. కార్మికులు, అధికారులు, యాజమాన్యం మధ్య సమన్వయం చేయడంతో పాటు వేలాది మంది ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ఈ విభాగంపై ఉంటుంది. అలాంటి కీలక స్థానంలో అనుభవజ్ఞుడు, కార్మిక సమస్యలపై అవగాహన ఉన్న సమర్థవంతమైన అధికారిని నియమించాలని కార్మిక సంఘాలు, ఉద్యోగ వర్గాలు కోరుతున్నాయి.

**పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలు**

ప్రస్తుతం సింగరేణిలో అనేక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. కార్మికుల సమస్యలు, అధికారుల పీఆర్పీ, మెడికల్ బోర్డుల కొనసాగింపు, మారు పేర్ల సవరణ వంటి అంశాలపై వేగవంతమైన నిర్ణయాలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా త్వరలో 11వ వేజ్ బోర్డు కాల పరిమితి ముగియనున్న నేపథ్యంలో 12వ వేజ్ బోర్డు ఏర్పాటుపై చర్చలు జరపాల్సిన అవసరం ఉంది. రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపు, సీపీఆర్ఎంఎస్ వైద్య సదుపాయం 15 లక్షలకు పెంపు, ట్రాన్స్‌ఫర్ కేసుల పరిష్కారం వంటి డిమాండ్లు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

**సంస్థ ఆర్థిక పరిస్థితుల్లో కీలక బాధ్యత**

సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిల అంశం కూడా ప్రధానంగా మారింది. ఈ అంశంపై ఇప్పటికే ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ, హెచ్ఎంఎస్ వంటి కార్మిక సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి పెంచుతున్నాయి. అంతేకాకుండా కొత్త కోల్ బ్లాకులు, గుర్తింపు



సంఘం ఇచ్చిన సమ్మె నోటీసులు, కొత్త లేబర్ కోడ్‌ల అమలు వంటి అంశాలను సమర్థవంతంగా పరిష్కరించగల అనుభవం కలిగిన అధికారి అవసరమని కార్మిక నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

**'సంక్షేమ శాఖ' నుంచి 'సమస్యల శాఖ'గా మారిందా?**

గత కొంతకాలంగా పర్సనల్ డిపార్ట్‌మెంట్‌పై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారంలో వేగం తగ్గిందని, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు అభిప్రాయపడుతున్నారు. కార్మిక సంక్షేమానికి వేదికగా ఉండాల్సిన పర్సనల్ డిపార్ట్‌మెంట్ మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కొత్త జీఎంకు సవాళ్లే సవాళ్లు**

జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం పదవి ప్రస్తుతం పూలబాట కాదు.. కత్తిమీద సాములాంటిదని సింగరేణి వర్గాల్లో చర్చ జరుగుతోంది. కార్మికులు, ఉద్యోగులు, యూనియన్ నాయకుల విశ్వాసాన్ని పొందుతూ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కొత్త అధికారిపై ఉంటుంది.గతంలో వివిధ కీలక పదవుల కోసం పోటీ ఉన్నట్లే ఈ పదవికి కూడా పోటీ ఉంటుందా? అనే చర్చ సాగుతోంది. అయితే పదవి కోసం కాకుండా సంస్థ, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేసే అధికారిని నియమించాలని కార్మిక వర్గం కోరుతోంది. మరి సింగరేణి యాజమాన్యం ఈ కీలక బాధ్యతను ఎవరికి అప్పగిస్తుంది? కొత్త జీఎం పర్సనల్ సంస్థలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గం చూపుతారా? అనేది వేచి చూడాల్సిందే.

# "జీవో-76కు బ్రేక్ పడిందా?

- పట్టాల కోసం కొత్తగూడెం పేదల నిరీక్షణకు తెర పడేది ఎప్పుడు ?
- జీవో 76 అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- సంకుబాపన అనుదిప్ డిమాండ్

**కొత్తగూడెం, జులై 28 (తెలంగాణ వాణి)**
బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకుని వచ్చిన జీవో ఎంఎస్ నెం.76 అమలు పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, కొత్తగూడెం నియోజకవర్గంలోని పేదలకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి సంబంధించి శ్వేతపత్రం విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు సంకుబాపన అనుదిప్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 76 ద్వారా ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీకి మార్గం సుగమం చేసినప్పటికీ, ప్రస్తుతం ఆ జీవో అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలన్నారు.

శాసనసభ ఎన్నికల సమయంలో కొత్తగూడెం పేదలకు ఇండ్ల స్థలాలు, గృహ హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆ తర్వాత కార్పొరేషన్ ఎన్నికల సమయంలో





రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా మళ్ళీ హామీను ఇచ్చినప్పటికీ ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని దీన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జీవో 76 కింద కొత్తగూడెం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎంతమందికి పట్టాలు పంపిణీ చేశారో, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయో పూర్తి వివరాలను విడుదల చేయాలని కోరారు.కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికల సమయంలో "100 రోజుల్లో జీవో 76 కింద పట్టాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారని, అయితే రెండున్నరేళ్లు గడిచినా ఆ హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి జీవో 76 అమలుకు స్పష్టమైన గడువు ప్రకటించాలని కోరారు. జీవో అమలుకు పరిపాలనా లేదా న్యాయపరమైన అడ్డంకులు ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల పట్టాల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు నిర్దిష్ట కాలపట్టిక ప్రకటించి, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా "జీవో ఎంఎస్ నెం.76 ప్రస్తుతం అమలులో ఉందా? లేక నిలిపివేశారా? అమలులో ఉంటే ఇప్పటివరకు ఎంతమందికి లబ్ధి చేకూరింది? నిలిపివేసి ఉంటే అందుకు గల కారణాలేమిటి? కొత్తగూడెం ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఎప్పుడు అందిస్తారు?" అనే ప్రశ్నలకు ప్రభుత్వం అధికారికంగా సమాధానం ఇవ్వాలని కోరారు. జీవో 76 అమలు స్థితిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి, కొత్తగూడెం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి నిర్దిష్ట గడువులో ఇండ్ల స్థలాల పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రంగరాజు రాజేష్, బత్తుల శ్రీనివాస్, అహ్మద్, గుమ్మడి సాగర్, కలకోటి ఐలయ్య, గాదం రాజేందర్, కాసోజు రామాచారి, న్యాయవాది రాధాకృష్ణ, మున్నా, పిక విద్యాసాగర్ పాల్గొన్నారు

# మారుమూల విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యం

**టీం సంభవ ఫౌండేషన్ సేవలు అభినందనీయం: కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి**



**బూర్గంపాడు, జూలై 28 (తెలంగాణ వాణి)**
మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో టీం సంభవ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుదాబాయి అన్నారు. మంగళవారం టీం సంభవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం బత్తులనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, చర్ల మండలంలోని కొండివాయి, ముల్కలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 120 మంది విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, జ్యామెట్రీ బాక్సులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుదాబాయి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి విద్యాభ్యాసానికి చేయూతనిస్తూ



భవిష్యత్తుకు బాటలు వేస్తున్న టీం సంభవ ఫౌండేషన్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. టీం ఫౌండేషన్ వాలంటీర్ రూప్లా నాయక్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా మారుమూల ప్రాంతాల్లో విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ ఎక్కువ మంది విద్యార్థులకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణసాగర్ సర్పంచ్ తాటివాణి, ఉప సర్పంచ్ మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సపావత్ బాలకృష్ణ చౌహాన్, ఎఫ్ఎల్ఎన్ జిల్లా మానిటరింగ్ మేనేజర్ అల్లూరి రెడ్డి, మండల రిసోర్స్ పర్సన్ జగన్, ఉపాధ్యాయులు భాస్కర్, సీఆర్పీ శారద, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు రజిత, సమ్మయ్య, నరేష్, రామకృష్ణ, మల్లేశ్వరి, రాము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com